సాక్షి
కుమురం భీం

శనివారం । 11 । అక్టోబర్ । 2025



మహిళలు.. మహారాణులు!

మహిళలు విద్య, రాజకీయం, ఉద్యోగాలతోపాటు వ్యాపారంలోనూ రాణిస్తున్నారు. డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని ప్రగతి సాధిస్తున్నారు. 8లో▸



విద్యార్థులకు సాంకేతిక విద్య

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ప్రభుత్వం ఏఐ బోధనకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 14 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏఐ బోధన సాగుతోంది. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.6 /22.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి యువరాజ

ఆసిఫాబాద్‌రూరల్: చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని చైతన్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆధునిక యుగంలో మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం జాతీయ మెంటల్ హెల్త్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందికి అవగాహన కల్పించారు.

దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఆసిఫాబాద్‌అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసే తాత్కాలిక బాణసంచా విక్రయ దుకాణాలకు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో సంబంధిత శాఖల అనుమతి లేకుండా ఎవరూ బాణసంచా విక్రయించొద్దన్నారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్, ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయాలకు పండుగకు వారం రోజుల ముందుగా అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్రంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు బాధ్యత వహించాలని అన్నారు.

పర్యటించి.. సూచనలు చేసి



రామ్మూర్తిని సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం జీఎం సీహెచ్‌పీ కార్పొరేట్ రామ్మూర్తి పర్యటించారు. ఏరియా అధికారులతో కలిసి గోలేటి సీహెచ్‌పీని సందర్శించారు. బొగ్గు రవాణా, నాణ్యత విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సకాలంలో అందించినప్పుడే సింగరేణి సంస్థకు ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమాల్లో ఎస్వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీరు కృష్ణమూర్తి, డీజీఎం ఉజ్వల్‌కుమార్, ప్రాజెక్టు ఇంజినీరు వీరన్న, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

29వ రోజుకు సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని డైలీవేజ్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శుక్రవారం 29వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ చేసిన పనికి వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కృష్ణమాచారి, ప్రభాకర్, వసంత్‌రావు, కోటయ్య, భరత్, వర్కర్లు శశికళ, దివ్య, లక్ష్మి, గంగుబాయి, ప్రమీల, దివ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రామా ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

అలరించిన సైన్స్ డ్రామా పోటీలు



ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థినులతో అధికారులు, ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌డ్రామా పోటీలు అలరించాయి. 'మానవ జాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత' అనే అంశంపై వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించగా, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి పొందారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సామాజిక స్పృహ కలిగించేలా డ్రామా ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేశ్వర్, న్యాయ నిర్ణేతలు వెంకటేశ్వర్లు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

స్టూడెంట్ లీడర్లు!

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు
- జట్టు భావన, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ప్రోత్సాహం

విద్యార్థుల కమిటీల పేర్లు, కేటాయించిన రంగులు

పేరు	కేటాయించిన రంగు
అబ్దుల్ కలాం	ఎరుపు
శకుంతలాదేవి	ఆకుపచ్చ
సీవీ రామన్	నీలం
రవీంద్రనాథ్ ఠాగూర్	పసుపు



కెరమెరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతలను పెంపొందించడమే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతీ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ఆధారంగా విద్యాశాఖ అధికారులు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. కలిసి పనిచేయడం ద్వారా పిల్లల్లో జట్టు భావన, బాధ్యత, నిర్ణయ సామర్థ్యం, సమయ పాలన, సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందుతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. జిల్లాలో 60 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా, 101 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. దాదాపు 32 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ప్రతీ బడిలో నాలుగు కమిటీలు..

ప్రతీ పాఠశాలలో విద్యార్థులతో నాలుగు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. మహనీయుల పేర్లతో ఏర్పాటు చేసే బృందాలకు ఎరుపు, ఆకుపచ్చ, నీలం, పసుపు రంగులు కేటాయిస్తారు. కెప్టెన్, వైస్ కెప్టెన్‌లుగా పై తరగతుల విద్యార్థులు వ్యవహరిస్తారు. బృందంలో మొత్తం ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఇద్దరు బాలికలు తప్పనిసరిగా ఉండాలి. ప్రధానోపాధ్యాయుడి నిధి నుంచి బృందాలకు ఒక్కో రంగు యూనిఫాం కేటాయించాలి. ఒక ఉపాధ్యాయుడు సలహాదారుడిగా వ్యవహరిస్తారు. వీరు ప్రతీనెల మూడో శనివారం సమావేశం నిర్వహించి పాఠశాల సమస్యలపై చర్చిస్తారు.

పర్యవేక్షణలో కీలకం..

విద్యార్థుల కమిటీలు పాఠశాలలో వివిధ పనులను పర్యవేక్షించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతిరోజూ విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించాలి. ఉదయం ప్రార్థన చేయించాలి. తోటి పిల్లలకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి. క్రమశిక్షణతో జట్టుగా పనిచేసేలా ప్రోత్సహించాలి. అయితే ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం అనేక బృందాలు పనిచేస్తున్నాయి. పచ్చదనం, పరిశుభ్రతకు ఏకో క్లబ్‌లు పనిచేస్తున్నాయి. భద్రత, బాలిక సాధికారత, ఆరోగ్యం, ప్రహరీ, లైబ్రరీ, సాహిత్య, సాంస్కృతిక, కళలు, క్రీడలు వంటి ప్రత్యేక క్లబ్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల కమిటీలు ఆయా క్లబ్‌లను సమన్వయం చేసుకుంటూ పనిచేయాల్సి ఉంటుంది.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



ప్రత్యేక బృందాల ఏర్పాటుతో ఇప్పుడు స్వయంగా నిర్ణయాలు తీసుకోవడం నేర్చుకుంటున్నాం. జట్టు సహకారంతో పనిచేయడం ఆసక్తికరంగా ఉంది. బాధ్యతగా ఉండటం అలవాటు చేసుకుంటున్నాం. చిన్న చిన్న పనులు విజయవంతంగా పూర్తిచేయడం ద్వారా మాలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

– రాజేశ్, 9వ తరగతి, కెరమెరి

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థుల బంగారు భవితకు చదువు ఒక్కటే ప్రామాణికం కాదు. అన్ని అంశాల్లో విషయ పరిజ్ఞానం అవసరం. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి. క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించుకోవడం అవసరం. ఇందుకోసమే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం.

– ఉప్పులేటి శ్రీనివాస్, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్

క్రీడలతో స్నేహభావం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి

రెబ్బెన(ఆసిఫాబాద్): క్రీడలతో వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల మధ్య స్నేహభావం పెరుగుతుందని బెల్లంపల్లి ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి అన్నారు. 92వ డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నియర్ బై బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల ఉద్యోగ క్రీడాకారులు సమష్టిగా రాణించి కోల్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించాలని అన్నారు. సీనియర్ క్రీడాకారుల నుంచి అవసరమైన సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు సంగెం ప్రకాశ్‌రావు, ఏఐటీయూసీ నాయకుడు జూపాక రాజేశ్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అన్వేశ్, జనరల్ కెప్టెన్ కిరణ్, పీఈటీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి'



మాట్లాడుతున్న సత్యనారాయణ మాదిగ

ఆసిఫాబాద్: సుప్రీంకోర్టు జడ్జిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ మందిర్ ఫంక్షన్ హాల్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. నిందితుడి వెనుక ఏ శక్తులు ఉన్నా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. అలాగే అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. ఈ నెల 22న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నిట్టూరి శ్రీశైలం, మహేశ్, రాజయ్య, శంకర్, నక్క విజయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వేళాయె

- నేటి నుంచి సింగరేణి మైదానంలో సెపక్‌తక్రా పోటీలు
- తరలిరానున్న పది ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం తెలంగాణ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీలకు వేదికగా మారింది. శనివారం నుంచి రెండు రోజులపాటు కొనసాగే ఈ క్రీడాపోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు తరలిరానున్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల నుంచి వందలాది మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. అండర్– 14, 19 విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. అండర్– 14 విభాగంలో బాలుర జట్లు 10, బాలికలు జట్లు 7, అండర్–19లో బా లుర జట్లు 10, బాలికల జట్లు 8 పాల్గొననున్నాయి. క్రీడాకారులతోపాటు కోచ్‌లు, మేనేజర్లు, అసోసియేషన్ అఫీషియల్స్‌తో కలిసి సుమారు 250 మంది హాజరుకానున్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు

రెండు రోజులపాటు సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం క్రీడాకారులతో కళకళలాడనుంది. వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు సెపక్‌తక్రా అసోసియేషన్ ఉచిత వసతి, భోజన సౌకర్యాలను కల్పిస్తోంది. గోలేటి టౌన్‌షిప్‌లోని సీ టైప్, డీ టైప్ క్వార్టర్లతోపాటు సింగరేణి పాఠశాలను క్రీడాకారుల వసతి కోసం కేటాయించగా, సీఈఆర్ క్లబ్‌లో భోజన వసతికి ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా పోటీలు ప్రారంభిస్తారు. సింగరేణి మైదానంలో ఏర్పాట్లను శుక్రవారం సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి తదితరులు పరిశీలించారు.

13 నుంచి ప్రత్యేక తరగతులు

- జనవరి 9లోగా పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఈ నెల 13 నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం డీటీడీవో రమాదేవితో కలిసి ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజరుశాతం తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడాలని సూచించారు. ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో కొన్నేళ్లుగా జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి 2, 3 స్థానాల్లో ఉంటుందని, ఈ ఏడాది మొదటి నుంచి 2, 3 స్థానాల్లో ఉండాలన్నారు. అభ్యాస దీపికలు ఉపయోగిస్తూ బోధన చేయాలని ఆదేశించారు. జనవరి 9లోగా వంద శాతం సిలబస్ పూర్తి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వందశాతం ఎఫ్ఆర్ఎస్, గతేడాది పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల హెచ్ఎంలను శాలువాలతో సన్మానించారు. సమావేశంలో జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్ బాబు, ఎస్‌వోలు శ్రీనివాస్, అబిద్ అలీ, ఎంఈవోలు సుభాష్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల చెక్‌పోస్టులు ఎత్తివేత

- జిల్లాలో నిఘా కోసం మూడు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు
- ఎన్నికల ప్రక్రియ ఆగిపోవడంతో తొలగింపు
- సాధారణ తనిఖీలు కొనసాగుతాయని అధికారుల వెల్లడి



వాంకిడిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టులను అధికారులు ఎత్తివేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆంక్షలు తొలగిపోయాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ తొలివిడత ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలతో 24 గంటలపాటు నిఘా పెట్టారు. నగదు, మద్యం, ఓటర్లను మభ్యపెట్టే వస్తువుల తరలింపుపై ఆంక్షలు విధించారు. ఆయుధాల తరలింపు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపైనా దృష్టి సారించారు. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోపై గురువారం హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల కమిషన్ కోడ్‌ను నిలిపివేయగా, జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టులను తొలగించారు.

మూడు చెక్‌పోస్టులు..

స్థానిక ఎన్నికల కోడ్‌లో భాగంగా మహారాష్ట్ర సరిహద్దున అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పొరుగు రాష్ట్రం నుంచి అక్రమ రవాణాకు ఆస్కారం ఉండటంతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఉత్తర్వులను జారీ చేశారు. నగదు, మద్యం సరఫరాను అడ్డుకునేందుకు తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వాంకిడి మండల కేంద్రంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద, సిర్పూర్(టి) మండలం వెంకట్రావ్‌పేట్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్, సిర్పూర్(టి) నుంచి విరూర్ వెళ్లే రోడ్‌లోని దుబ్బగూడ వద్ద ఈ ఎన్నికల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ప్రారంభించారు. ప్రతీ చెక్‌పోస్ట్ వద్ద స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్(ఎస్ఎస్‌టీ)ను నియమించారు. వాంకిడి చెక్‌పోస్ట్ వద్ద ఆర్ఐ(గిర్దావార్)తోపాటు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు ఏఎస్సైలకు విధులు కేటాయించగా, వెంకట్రావ్ చెక్‌పోస్ట్ వద్ద ఆర్ఐ, పోలీస్ కానిస్టేబుల్, వీడియో గ్రాఫర్, దుబ్బగూడ చెక్‌పోస్ట్ వద్ద ఇద్దరు జీపీవోలు, పోలీస్ కానిస్టేబుల్, ఒక వీడియోగ్రాఫర్‌కు విధులు కేటాయించారు.

కోడ్ ఆంక్షలకు బ్రేక్..

ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ప్రత్యేక చెక్‌పోస్టులు తొలగించారు. ఎన్నికల కోడ్ ఆంక్షలు అమలులో ఉండవు. ఎప్పటిలాగే సాధారణ తనిఖీలు మాత్రమే నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నగదు, వస్తువుల రవాణాను కట్టడి చేయాల్సి ఉంటుంది. ఒక వాహనంలో రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు పట్టుబడినా.. రూ.10 వేలకు పైగా విలువైన మద్యం, బహుమతులు, ఇతర వస్తువులు తరలించినా సీజ్ చేస్తారు. వ్యాపార అవసరాల నిమిత్తం బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు తీసుకెళ్తున్న నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపాలి. బ్యాంకు నుంచి తీసుకున్న నగదుకు విత్‌డ్రా స్లిప్‌లు, పాన్‌కార్డు, అకౌంట్ బుక్, వ్యాపార రిజిస్ట్రేషన్ పత్రాలు వంటివి ఉండాలి. అలాగే వైద్యం, పెళ్లి కోసం తీసుకెళ్తున్న నగదు, నగలు అయితే ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఆస్పత్రికి సంబంధించిన రసీదు, వివాహ వేడుకలకైతే వివాహ ఆహ్వాన పత్రం లేదా కల్యాణ మండపం బుకింగ్ వంటి ఆధారాలు ఉంచుకోవాలి. చెక్‌పోస్టుల ఎత్తివేత విషయమై టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్‌ను వివరణ కోరగా.. హైకోర్టు స్టేతో ఎన్నికల కోడ్ తొలగించినందున ఎన్నికల నిబంధనలు, ఆంక్షలకు తాత్కాలికంగా విరామం ఇచ్చినట్లు తెలిపారు. మళ్లీ నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఆదేశాల మేరకు కోడ్ అమల్లోకి వస్తుందని, అప్పటివరకు సాధారణ తనిఖీలు మాత్రమే కొనసాగుతాయని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం

- జిల్లా కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. రెడ్డి జాగృతి నాయకుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీల్లో విభేదాలు తీసుకురావడానికి కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కుటిల రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టులో వేసిన పిటిషన్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో బీసీల పాత్ర కీలకమైందని, తమ హక్కులు కాలరాసే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 56శాతం ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతుంటే రాజకీయ పార్టీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీసీలు సంఘటితమై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పిటిషన్‌ను వెనక్కి తీసుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధిక, సుప్రజ, ఇరుకుల మంగ, మామిడి కిరణ్, లహుకుమార్, వెంకటేశ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి కుచ్చుల తయారీపై వీడియో చిత్రీకరణ



వరి కుచ్చులతో విజయలక్ష్మి, అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ సమీపంలో శుక్రవారం వరి కుచ్చుల తయారీపై వీడియో చిత్రీకరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన పర్యాటక బృందం అధికారులు చిరాక్, మనీశ్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వరి కుచ్చుల తయారీపై ఫొటో, వీడియో చిత్రీకరించారు. డీఆర్డీవో ఢిల్లీ అధికారులతో కలిసి వరి కోసి కుచ్చులు తయారు చేశారు. లక్ష్మణచాంద, సోన్ ఐకేపీ ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కిష్టాపూర్ వద్ద గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఒక్క ట్రాక్టర్ షెట్‌పల్లి వద్ద, మరో రెండు ట్రాక్టర్లు నర్సింగాపూర్ వద్ద పట్టుబడగా వాటిని పోలీస్‌స్టేషన్ తరలించి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు



చికిత్స పొందుతున్న పూలమ్మ

ముథోల్: మండలంలోని నయాబాదీ కాలనీకి చెందిన పూలమ్మ అనే వృద్ధురాలు కోతి దాడిలో తీవ్రంగా గాయపడింది. వివరాలు.. శుక్రవారం పూలమ్మ తన ఇంటి నుంచి గోధుమలు, జొన్నలు తీసుకుని గిర్నికి వెళ్తుండగా కోతులు ఆమెపై దాడి చేశాయి. గోధుమలు, జొన్నలను చెల్లాచెదురు చేసి ఆమెపై దాడి చేయగా నడుము భాగంలో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు చికిత్స అందించారు.

కిరాణా షాపులో చోరీ

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామంలో కొటారపు భీమన్నకు చెందిన కిరాణా షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. భీమన్న షాపునకు తాళం వేసి మంచిర్యాల ఆస్పత్రికి వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. రూ.30వేల నగదు, రూ.7వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఆస్పత్రి నుంచి వచ్చిన భీమన్న దుకాణంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రసాద్ సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

చెట్ల నరికివేతపై విచారణ

దండేపల్లి: మండలంలోని తానిమడుగు ప్రత్యేక బీట్‌లో దసరాకు ముందు చెట్లు నరికివేసినట్లు వీడియోలు వైరలయ్యాయి. దీనిపై అటవీ శాఖ అధికారులు తానిమడుగు బీట్‌లో రెండు రోజులు పర్యటించి పరిశీలించారు. 40చెట్లు నరికివేసినట్లు గుర్తించారు. వాటి విలువ రూ.2.80 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కాగా, ఈ ఘటనలో కొంతమందిని అనుమానిస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

వైకుంఠధామం గేటు చోరీ



కిష్టాపూర్ వైకుంఠ ధామం కమాన్

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని వైకుంఠధామానికి చెందిన ఇనుప గేటును దొంగలు ఎత్తుకెళ్లిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన యువకులు ఈ విషయాన్ని గ్రామ వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి గోపీచంద్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అనూష వైకుంఠధామం పరిసర ప్రాంతాలను పరిశీలించి త్వరలో నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

మహిళలు.. మహారాణులు!

- స్వయం ఉపాధి వైపు అతివల చూపు
- తక్కువ వడ్డీ రుణాలతో వ్యాపారాలు
- పురుషులకు దీటుగా రాణిస్తున్న వైనం
- ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు..

తానూరు: మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఇంటిని చక్కదిద్దడమే కాదు.. కుటుంబ పోషణకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. విద్య, రాజకీయం, ఉద్యోగాలతో పాటు వ్యాపారంలోనూ రాణిస్తున్నారు. డ్వాక్రా సంఘంలో తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న కొందరు మహిళలపై కథనం..



గ్రామంలోనే వ్యాపారం చేస్తున్న

డ్వాక్రా సంఘంలో రూ.5లక్షలు రుణం తీసుకుని గ్రామంలోనే బట్టల షాపు, లేడీస్ టైలర్, ఎంబ్రాయిడరీ, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న. స్వయంగా దూరప్రాంతాలకు వెళ్లి కొత్త కొత్త నమూనాలు ఎంపిక చేసి తీసుకువస్తున్న. కస్టమర్లు కోరిన నమూనాలు అందిస్తున్న. పదిమందికి కుట్టు శిక్షణ కూడా ఇస్తున్న. వ్యాపారంలో వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణకు సహకారం అందిస్తున్న.

– పద్మ, తానూరు

ప్రమిదలు తయారు చేస్తున్న

గ్రామంలోని స్వయం సహాయక సంఘం ద్వారా రుణం తీసుకుని మట్టి ప్రమిదలు తయారు చేస్తున్న. వాటిని స్వయం సహాయక సంఘాలు, మార్కెట్‌కు సరఫరా చేస్తూ లాభాలు పొందుతున్న. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు ఐదువేల ప్రమిదలు సరఫరా చేసేందుకు అధికారుల నుంచి ఆర్డర్ వచ్చింది. రుణం తీసుకుని కులవృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న.

– చంద్రబాయి, కోలూరు

ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న

సంఘంలో రుణం తీసుకుని ఆర్‌సీఎం హోల్‌సేల్ షాప్ ప్రారంభించిన. వ్యాపారంలో కొనసాగుతూ లాభాలు గడిస్తున్న. వ్యాపారంలో వచ్చిన ఆదాయాన్ని రుణ వాయిదాలు చెల్లించి మిగతా డబ్బులను కుటుంబ పోషణ కోసం ఖర్చు చేస్తున్న. కొంత మొత్తాన్ని పొదుపు కూడా చేస్తున్న. నా భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ ఆర్థికాభివృద్ధి సాధించడం సంతోషంగా ఉంది.

– అంజనాబాయి, తానూరు

ఇంటి పనులు చేసుకుంటూనే..

డ్వాక్రా సంఘంలో తక్కువ వడ్డీకి రుణం తీసుకుని మార్కెట్‌లో బ్యూటీ పార్లర్, లేడీస్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న. మా పిల్లలను పాఠశాలకు పంపించి ఇంటి పనులు ముగించుకుని వ్యాపారం చేస్తున్న. టైలరింగ్‌లో యువతకు శిక్షణ ఇస్తున్న. ఒక వ్యాపారం చేస్తున్నప్పుడే కొత్త ఆలోచనలకు అవకాశం కలుగుతుంది. సమాజంపై అవగాహన వస్తుంది.

– విజయలక్ష్మి, తానూరు

కిరాణా షాపు నిర్వహిస్తున్న



డ్వాక్రా సంఘం ద్వారా తక్కువ వడ్డీకి రుణం తీసుకున్న. గ్రామంలోనే కిరాణా షాపు ప్రారంభించిన. దుకాణం ద్వారా వచ్చిన ఆదాయంతో రుణ వాయిదాలు చెల్లిస్తున్న. మిగిలిన మొత్తం కుటుంబ పోషణ, పిల్లల చదవుకు ఖర్చు చేస్తున్న. రుణాలు సక్రమంగా చెల్లిస్తే అధికారులు మళ్లీ అడిగినంత రుణం ఇస్తున్నరు. సొంతంగా కిరాణా దుకాణంతో ఉపాధి పొందడం ఆనందంగా ఉంది.

– శోభ, కోలూరు

స్త్రీశక్తి ద్వారా రుణాలిస్తున్నాం



గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు వ్యాపారం చేసుకోవడానికి స్త్రీశక్తి ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నాం. స్వయం ఉపాధి వైపు వారిని ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే తానూరు మండలంలో 725 మహిళా సంఘాలు కొనసాగుతున్నాయి. ఈ సంఘాలకు రూ.16కోట్ల రుణాలందించాం. రుణాలు పొందిన మహిళలు వ్యాపారాలు కొనసాగిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు.

– సులోచనరెడ్డి, ఐకేపీ ఏపీఎం

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న వెంకటేశ్వరస్వామి

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14, 17 బాలబాలికల అథ్లెటిక్ ఎంపిక పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాసిపేట జెడ్పీహెచ్‌ఎస్ సహకారంతో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 600మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరస్వామి, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ యాకూబ్, పాఠశాల హెచ్‌ఎం సాంబమూర్తి, పర్యవేక్షకులు రేణి రాజయ్య, భూక్యా రాజన్న, పీడీ మారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వాలీబాల్ ఎంపిక పోటీలు

ఈనెల 11న పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో లక్సెట్టిపేట జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) పాఠశాలలో అండర్–17, 14 బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకూబ్ ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

ఐదుగురు ఉద్యోగులపై కేసు

మందమర్రిరూరల్: ఆగస్టు చివరి వారంలో మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో విధి నిర్వహణ విషయంలో ఇరువురు జాతీయ కార్మిక సంఘాల నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిపై ఓ సంఘం నాయకుడు మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. కేసు నమోదు చేయకుండా పలుసార్లు రాజీ కోసం ప్రయత్నించగా ఫిర్యాదుదారు నిరాకరించారు. దీంతో ఉన్నతాధికారుల ప్రమేయం, కోర్టు ఆదేశాల మేరకు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎస్సై రాజశేఖర్‌ను వివరణ కోరగా.. కోర్టు అనుమతితో గురువారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇది సింగరేణి చరిత్రలో మొదటి కేసుగా పలువురు పేర్కొంటున్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు మాటామాట అనుకుంటే గని ఉన్నతాధికారి వద్ద ఫిర్యాదు చేసుకుంటే సదరు అధికారి సర్ది చెప్పేవారు. లేదా నోటీసులివ్వడమో, సంజాయిషీ కోరడమో, రాజీ కుదుర్చడమో జరిగేది. దీంతో గొడవలు సద్దుమణిగేవి. కానీ, కేకే ఓసీలో జరిగిన ఘటన కేసు వరకు రావడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పుస్తక రచనలో జిల్లా ఉపాధ్యాయులు



అందుబాటులోకి వచ్చిన తెలుగుఅకాడమీ పుస్తకం



నారాయణవర్మ, వందనకుమారి

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ తెలుగు అకాడమీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే పుస్తక ప్రచురణ సంస్థ. సంస్థ డీఎస్సీకి రూపొందించిన స్టడీ మెటీరియల్‌లో భౌతిక రసాయన శాస్త్రం కంటెంట్ పుస్తక రచనలో నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. కడెం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పీ నారాయణవర్మ, తానూరు మండలం భోసి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు సీహెచ్ వందనకుమారి భాగస్వాములయ్యారు. గత జనవరిలో ఈ పుస్తకం తుదిరూపు దిద్దుకోగా తాజాగా ప్రచురితమై అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పుస్తకం డీఎస్సీ, టెట్ పరీక్షల కోసం తెలుగు మీడియం వారికి ప్రయోజనకారిగా ఉండనున్నట్లు పుస్తక రచయితలు తెలిపారు. వీరిరువురు 24 ఏళ్లుగా సైన్స్ ఫెయిర్, ప్రాజెక్ట్ పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంచడంలో సఫలీకృతులయ్యారు. పాఠ్యాంశాల బోధనలోనూ తమదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

పేగు బంధానికి వీడ్కోలు

- కొడుకు చితికి నిప్పు పెట్టిన తల్లి



నరేశ్ (ఫైల్)



నరేశ్ అంతిమయాత్రలో తల్లి రాజమ్మ

తాండూర్: జీవిత చరమాంకంలో తనకు తలకొరివి పెట్టి నరకం నుంచి తప్పిస్తాడనుకున్న ఆ కొడుకుకు కన్న తల్లే తలకొరివి పెట్టింది. ఈ విషాద ఘటన మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. మాదారం టౌన్‌షిప్ గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికురాలు సలాకుల రాజమ్మకు రమేశ్, నరేశ్ ఇద్దరు కుమారులున్నారు. వీరిలో రమేశ్ ఏడాది క్రితమే అనారోగ్యంతో మరణించాడు. ఆ విషాదం నుంచి ఇంకా తేరుకోకముందే ఆ తల్లిని మరో చేదు వార్త వెంటాడింది. చిన్న కుమారుడు నరేశ్ కూడా ఫిట్స్‌తో గురువారం మృతి చెందాడు. దీంతో ఆమె అంతులేని శోకాన్ని అనుభవించాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం నరేశ్ అంత్యక్రియలు నిర్వహించగా తల్లి రాజమ్మే కుండపట్టి కొడుకును కాటివరకు సాగనంపింది. తీవ్ర దుఃఖాన్ని దిగమింగుతూ కొడుకు చితికి నిప్పంటించి పేగు బంధానికి కన్నీటి వీడ్కోలు పలికింది. రాజమ్మ రోధించిన తీరుకు పలువురు కంటతడి పెట్టుకున్నారు. నరేశ్‌కు భార్య, కుమార్తె ఉంది. ఏడాది వ్యవధిలోనే రాజమ్మ ఇద్దరు కుమారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

రెబ్బెన: మండలంలోని రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఖాళీ స్థలం వాగు ఒడ్డు వద్ద శుక్రవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాల సమీపాన ఉన్న అహ్మద్‌బిన్ మహ్మద్ ఖాళీ స్థలంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు 55–60 ఏళ్లు ఉంటుందని, 5.3 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై మెరూన్ రంగు డ్రాయర్, నీలి రంగు టీషర్టు ఉన్నట్లు తెలిపారు. భిక్షాటన చేస్తూ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుంటాడని, శుక్రవారం తెల్లవారుజామున ఆకలితో మృతి చెంది ఉంటాడని ఎస్సై భావిస్తున్నారు. కాగా, మృతుడి సమాచారం తెలిసినవారు 8712670532 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఒకరిపై పోక్సో కేసు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని గాంధీనగర్‌కు చెందిన ఎర్రల వర్ధన్‌పై పోక్సో చట్టం కింద ఈ నెల 8న కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7న వర్ధన్ ఓ బాలిక ఫొటోలను ఆమె సమ్మతి లేకుండా అతని సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై ఆమె ప్రశ్నించినందుకు బాలికతోపాటు ఆమె మేనమామను కూడా బెదిరించాడు. తనను వెంబడిస్తూ ఫొటోలు పోస్టులు చేసి మానసికంగా వేధిస్తూ, తన ఇంటి వద్ద గొడవ చేసి తనను నెట్టేసిన వర్ధన్‌పై చర్య తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌పై దాడి



ట్రాక్టర్ యజమానులు, అధికారుల మధ్య జరుగుతున్న వాగ్వాదం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని రాస్పెల్లి శివారు అటవీ భూమి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబు పాటేకర్, అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. వాటిని రాస్పెల్లి నుంచి కాగజ్‌నగర్ రేంజ్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ యజమాని నాసిర్‌అలీ ఖాన్ అడ్డుకుని ఫారెస్ట్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. తాను పట్టా భూముల నుంచి మాత్రమే ఇసుక తరలిస్తున్నానని, అది అటవీ ప్రాంతం కాదని వాదించాడు. అయితే నాసిర్‌అలీ ఖాన్ తమ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై దాడి చేశారని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబుపాటేకర్ ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాసిత్‌అలీఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈజ్‌గాం ఎస్సై కల్యాణ్ తెలిపారు. పట్టుకున్న ఆరు ట్రాక్టర్లను రేంజ్ కార్యాలయానికి తరలించారు.

మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య

నిర్మల్ రూరల్: మండలంలోని అనంతపేట గ్రామానికి చెందిన బొబ్బిలి నరేందర్ యాదవ్ (27) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడ్డట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నరేందర్ యాదవ్ కొంతకాలంగా మద్యానికి బానిసై తన భార్యను నిత్యం వేధించేవాడు. దీంతో ఆమె కొంతకాలం క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన నరేందర్ గురువారం సాయంత్రం గ్రామ శివారులో మద్యం మత్తులో పురుగుల మందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జిల్లా కేంద్రంలోని ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అన్నం పెట్టినోడికే కన్నం..

ఆదిలాబాద్‌టౌన్: అన్నం పెట్టినోడికే కన్నం పెట్టిన సామెత ఈ ఘటనకు అద్దం పడుతోంది. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన జీ అశోక్ ఇంటి సమీపంలో అపరిచిత వ్యక్తి శుక్రవారం కూర్చొని ఉన్నాడు. అతడి వద్దకు వెళ్లిన అశోక్ ఇక్కడ ఏం చేస్తున్నావని అడగగా, తనకు ఆకలి అవుతోందని అన్నం పెట్టమని కోరాడు. దీంతో బాధితుడు తన ద్విచక్ర వాహనాన్ని నడపమని చెప్పి తాను వెనుక కూర్చున్నాడు. తెలంగాణ చౌక్ ప్రాంతంలో మద్యం తాగించి భోజనం చేయించాడు. ఈ క్రమంలో అశోక్ అక్కడే ఉండగా నిందితుడు బైక్ తీసుకుని పారిపోయాడు. సీసీ ఫుటేజీలో ఈ దృశ్యం రికార్డయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ వివరించారు.

ఆర్జీయూకేటీలో మానసిక ఆరోగ్య దినోత్సవం



కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అధికారులు, విద్యార్థులు

బాసర: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం మానసిక స్వస్థత కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవడానికి ఉదయం వ్యాయామం, ధ్యానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శారీరక వ్యాయామాలు, ధ్యానం, మానసిక ఆరోగ్య అవగాహన కోసం క్యాంపస్‌లో ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఆర్జీయూకేటీ మానసిక స్వస్థత కేంద్రం సిబ్బంది, శారీరక విద్యావిభాగ సిబ్బంది పాల్గొన్నారు.

నెమలిని చంపిన నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్ఆర్వో

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామ సమీపంలోని చేనులో ముగ్గురు వ్యక్తులు జాతీయ పక్షి నెమలిని చంపారు. ఎఫ్ఆర్వో ప్రణయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాదిగూడ మండలం ఖాండురాంపూర్ గ్రామానికి చెందిన బద్వాల్ గంగాసింగ్ బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 9న చేనులో గడ్డి కోస్తూ ఉండగా గంగాసింగ్‌కు నాలుగు నెమలి గుడ్లు కనిపించాయి. దీంతో అక్కడికి నెమలి వస్తుందని గమనించాడు. పొచ్చెర గ్రామంలోనే వలస కూలీలుగా ఉన్న గాదిగూడ మండలం లోకారికి చెందిన దత్తు, ఇంద్రవెల్లి మండలం గోపాల్‌పూర్‌కు చెందిన బాలాజీతో కలిసి గురువారం రాత్రి గుడ్లపై పొదిగిన నెమలిని కర్రతో కొట్టి చంపాడు. నెమలి, గుడ్లను బైక్‌పై తీసుకెళ్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు వారి ద్విచక్రవాహనం ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద చని పోయిన నెమలి, గుడ్లు కనిపించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న యువకుడి అరెస్ట్



జైపూర్: గంజాయి మొక్క, నిందితుడితో ఎస్సై



ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసుల అదుపులో నిందితుడు

జైపూర్: గంజాయికి అలవాటు పడిన యువకుడు ఏకంగా ఇంటి సమీపంలోనే మొక్కలు పెంచుతుండడంతో పక్కా సమాచారం మేరకు పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన బొడ్డున సత్యనారాయణ అనే యువకుడు గంజాయికి అలవాటు పడ్డాడు. తన ఇంటి సమీపంలోనే గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీధర్, తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. సత్యనారాయణ ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించి చెన్నూర్ కోర్టులో హాజరు పరిచారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, సాగు చేసినా కఠినచర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

తిర్యాణి మండలంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: తిర్యాణి మండల పరిధిలోని చెలిమెల గ్రామం కొద్దుగూడ శివారులో ఆత్రం పాపారావ్ (32) తన కంది చేనులో గంజాయి సాగు చేస్తుండగా అతడిపై కేసు నమోదు చేసినట్లు తిర్యాణి ఎస్సై వెంకటేశ్ తెలిపారు. 10గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వాంకిడి: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మండలంలోని జాతీయ రహదారిపై ఖమాన ఎక్స్ రోడ్ సమీపంలో చోటు చేసుకుంది. ప్రమాదంలో ఖమాన గ్రామానికి చెందిన విలాస్, భూమయ్య, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లలిత్ గాయాలపాలయ్యారు. వారిని చికిత్స కోసం నేషనల్ హైవేకు చెందిన అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి సంబంధించిన వివరాల కోసం ఎస్సై మహేందర్‌ను సంప్రదించగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.